క్లుప్తంగా

సూచిక బోర్డులో టీడీపీ బ్యానర్



సూచిక బోర్డుపై ఏర్పాటు చేసిన టీడీపీ బ్యానరు

పూతలపట్టు: వాహనదారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సూచికబోర్డుపై టీడీపీ బ్యానర్ పెట్టడం ఏంటని గురువారం ఎమ్మెల్యే ఎంఎస్ బాబు జాతీయ రహదారి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పూతలపట్టు నుంచి రంగంపేట క్రాస్ వరకు మధ్యలో నేషనల్ హైవే సూచిక బోర్డును అధికారులు ఏర్పాటు చేశారు. ఆ బోర్డుపై రహదారులకు సంబంధించిన వివరాలు పొందుపరిచారు. అయితే ఆ బోర్డుపై టీడీపీకి సంబంధించిన బ్యానర్లను నింపడంతో దారి తెలియక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీనిపై ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు మాట్లాడుతూ, బ్యానర్‌ను తొలగించకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

యాదమరి ఎస్‌ఐగా మునస్వామి



మునస్వామి

యాదమరి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా మునస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ సుమన్ బదిలీపై రాళ్లబూదుగూరుకు వెళ్లగా అక్కడ ఉన్న ఎస్‌ఐ మునస్వామి బదిలీపై యాదమరికి వచ్చారు. ఆయన ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండల పరిధిలో శాంతి భద్రతలను పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

పూతలపట్టులో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలు

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌ఎంఎంఎస్ మాదిరి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పీఆర్‌టీయూ అసోసియేట్ అధ్యక్షులు మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ సౌజన్యంతో మాదిరి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వారి పాఠశాల ప్రధానోపాధ్యాయుల వద్ద నుంచి ధ్రువీకరణ పత్రాలతో 9441804246 నెంబరుకు తెలియజేయాలని తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 గంటల్లోపు వివరాలను విద్యార్థులు తెలియజేయాలని తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



కార్మికులతో మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ సంఘ నాయకులు నాగరాజన్ కోరారు. చిత్తూరులోని ఎస్టీయూ కార్యాలయంలో గురువారం మునిసిపల్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. నాగరాజన్ మాట్లాడుతూ చెత్తసేకరించే పుష్‌కాట్‌కు ఇద్దరు సిబ్బందిని కేటాయించాలని, ట్రాక్టర్, టిప్పర్లకు ముగ్గురు ఇవ్వాలని, యూనిఫామ్, నూనె, పాదరక్షలు రెండేళ్లుగా ఇవ్వడం లేదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే వచ్చేనెల 4వ తేదీన నిరసనలు చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు చంద్ర, రమాదేవి, మణి, రఘు, వర్కర్స్ యూనియన్ నాయకులు జయశంకర్, వినాయ, శోభన్‌బాబు, ఈశ్వర్, మునిరత్నం, సుకన్య, చిత్ర తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నగర సెంట్రల్ అధ్యక్షుడిగా షణ్ముగం

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు నగర సెంట్రల్ అధ్యక్షుడిగా స్థానిక ఎంఎస్‌ఆర్ సర్కిల్‌కు చెందిన జి.షణ్ముగం నియమించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు వివరాలను తెలియజేశారు. ఆయన పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని వివరించారు.

డీఈఓకు వినతి పత్రం



వినతిపత్రమిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : సీఆర్‌సీ సమావేశాలు ఆయా మండలాల్లోనే నిర్వహించాలని ఏపీటీఎఫ్ (1947) జిల్లా అధ్యక్షులు గోపినాథమ్ గురువారం డీఈఓ విజయేంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 29, 30 తేదీల్లో సీఆర్‌సీ సమావేశాల నిర్వహణకు ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఆ ఉత్తర్వుల్లో ప్రకారం మూడు, నాలుగు మండలాలు కలిపి ఒకే చోట సమావేశాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సబ్జెక్ట్ సీఆర్‌సీ సమావేశాలు పాతపద్ధతిలోనే నిర్వహించాలని కోరారు.

సర్కారు బడుల్లో సాంకేతిక బోధన

సర్కారు బడులు సాంకేతిక విద్యను అందిపుచ్చుకుంటున్నాయి. ఆధునికత దిశగా దూసుకుపోతున్నాయి. బడి పరిసరాలు పరిశుభ్రంగా మారాయి. ఆవరణ పచ్చదనం పరుచుకుంది. ఉపాధ్యాయుల నియామకాలు పూర్తయ్యాయి. మధ్యాహ్న భోజనం, విద్యా సామగ్రితోపాటు, దుస్తులు విద్యార్థులకు సకాలంలో అందుతున్నాయి. ప్రతి ఏటా అమ్మ ఒడి పథకం కింద డబ్బులు తల్లుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. దీంతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు సాంకేతిక విద్య వైపు అడుగులు వేసేలా ట్యాబ్‌లు ఉపయోగపడుతున్నాయి.

- ఆఫ్‌లైన్‌లోనూ పాఠ్యాంశాలు చదువుకోవచ్చు
- సర్కార్ విద్యకు మహర్దశ
- సంతోషం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ట్యాబ్ ద్వారా బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఐరాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తున్నారు. మౌళిక వసతులను మెరుగుపరుస్తున్నారు. పిల్లలను పాఠశాలల్లో చేర్పించి చదివిస్తే, తల్లుల ఖాతాలకు అమ్మఒడి పథకం కింద ప్రభుత్వం ఏటా సొమ్మును జమ చేస్తోంది. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే విద్యార్థులకు అన్ని రకాల విద్యాసామగ్రితో కూడిన జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్నారు. ఇవేకాకుండా జగనన్న గోరుముద్ద పథకంతో ప్రతి పాఠశాలలోనూ విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఇపుడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సాంకేతిక విద్య అందించేందుకు 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. దీన్ని బట్టి ప్రభుత్వ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యం ఇస్తుందో అర్థం చేసుకోవచ్చు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోంది. నాణ్యమైన విద్యను పేద విద్యార్థులకు అందించేందుకు వీలుగా ట్యాబ్‌లు అందించారు. దీంతో ప్రభుత్వ విద్యకు మహర్దశ చేకూరనుంది.

ట్యాబ్‌లలో పాఠాలు ఇలా..

విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లలో బైజూస్ సంస్థ అందించిన అభ్యాసన సమాచారంతో గణితం, భౌతిక, రసాయన, పౌర, జీవశాస్త్రాలు, చరిత్ర పాఠ్యాంశాలను పొందుపరిచారు. మొత్తం 57 పాఠ్యాంశాలకు 471 విధానాలతో 300 వీడియోలను, జవాబులతో కూడిన 168 ప్రశ్న పత్రాలను ఇందులో ఉంచారు. ఒక్కో పాఠ్యాంశం తర్వాత 40 నుంచి 50 ప్రశ్నలు, గ్రేడ్‌ల వారీగా నమూనా పరీక్షలు ఉంటాయి. దీనివల్ల బడిలో నేర్చుకున్న పాఠ్యాంశాలను విద్యార్థులు ఇంటి వద్ద పునఃశ్చరణ చేసుకోవడానికి వీలు కలుగుతుంది. ఆయా పాఠాలు సులువుగా అర్థం అయ్యేలా బొమ్మలు, వీడియో, ఆడియో, త్రీడీ, యానిమేషన్ల ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్లను అందుబాటులో ఉంచారు. దీని వల్ల విద్యార్థులకు పాఠాలు సులభంగా అర్థం అవుతాయి. ఒకసారి ట్యాబ్‌లో అప్‌లోడ్ చేసిన పాఠ్యాంశాలను ఆఫ్‌లైన్లో కూడా విద్యార్థులు చదువుకోవచ్చు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోయినా చదువు కోవడానికి ఎటువంటి ఇబ్బంది ఉండదని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం



గతంలో ప్రభుత్వ పాఠశాలలను అంతగా పట్టించుకోలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయిన వెంటనే పాఠశాలల్లో వసతులు మెరుగు పరచడంతోపాటు నాణ్యమైన బోధన కోసం విద్యార్థులకు ట్యాబ్‌లు అందించారు. వాటి వల్ల విద్యార్థులు ఇంటి వద్ద కూడా పాఠాలు చదువుకోవడానికి అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇంతగా ఆలోచిస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం

– ప్రియాంక, విద్యార్థి తల్లి, ఐరాల

చాలా సంతోషంగా ఉంది



ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల ద్వారా బోధన చాలా బాగుంది. ప్రతి పాఠ్యాంశం సులభంగా అర్థం అవుతోంది. చదివింది, చూసింది, విన్నది అన్నీ అలాగే గుర్తుండిపోతున్నాయి. తరగతి గదిలో ఉపాధ్యాయులు అన్ని అంశాలనూ బోధించడమే గాకుండా ఇంటివద్ద కూడా ఏయే అంశాలు నేర్చుకోవాలో వివరంగా చెబుతున్నారు. ఇంటి వద్ద చదువుకోవడానికి ఈ ట్యాబ్ ఎంతో ఉపయోగకరంగా ఉంది.

– హేమలత, 9వ తరగతి , ఐరాల

ఎంతో మంచి నిర్ణయం



విద్యార్థులకు సాంకేతిక విద్యకు దగ్గర కావడానికి, సాంకేతికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తున్నారు. ఇది ఎంతో మంచి నిర్ణయం. విద్యార్థులు ఎక్కువ మంది సద్వినియోగం చేసుకుంటున్నారు. కానీ ఇంటి వద్ద ట్యాబ్ వినియోగంపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలి.

– సుబ్రమణ్యం, బయాలజీ టీచర్, ఐరాల

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

పూతలపట్టు: బాధితురాలికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును ఎమ్మెల్యే ఎంఎస్‌బాబు అందజేశారు. మండలంలోని తలపులపల్లికి చెందిన సుబ్రమణ్యం కిడ్నీ సమస్యలతో బాధపడుతూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆపరేషన్ అనంతరం వారికి అండగా సీఎం రిలీఫ్‌ఫండ్ రావడంతో గురువారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు సుబ్రమణ్యం సతీమణికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ ప్రవీణ్, నాయకులు నిరంజన్‌రెడ్డి, గణపతిరెడ్డి, పురుషోత్తంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

30న మొగిలీశ్వరాలయ దుకాణాల లీజు వేలం

బంగారుపాళెం: మండలంలో మొగిలి శివాలయానికి సంబంధించిన వివిధ దుకాణాలకు ఈ నెల 30న లీజు వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజు, వంశ పారంపర్య ధర్మకర్త విజయకుమార్ తెలిపారు. ఆలయం ఆవరణలో ఉదయం వాహనాల పార్కింగ్, తలనీలాలు పోగుచేసుకొనుట, పూజా సామగ్రి విక్రయం, పాదరక్షలు భద్రపరచుట, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కులకు సంబంధించి దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం ఆలయ కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం



కలశస్థాపనకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

యాదమరి: మండలంలోని మాదిరెడ్డి పల్లెలో నూతనంగా నిర్మించిన దండుమారియమ్మ ఆలయానికి అర్చక వేదపండితులు గురువారం ఉదయం ఘనంగా కుంభాభిషేకం నిర్వహించారు. వేకువజామున ఆలయంలో మూలస్థానంలో అమ్మవారి విగ్రహం ప్రతిష్టించి పూజలు చేసి గోపురంపై కలశస్థాపన చేశారు. పూజాది కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, ఎంపీపీ సురేష్, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి విచ్చేయగా వారిని గ్రామస్తులు స్వాగతం పలికారు. వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో విజయానంద రెడ్డి



కాణిపాకంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డితో ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి దర్శించుకున్నారు. ఆయన గురువారం రాత్రి స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, కాణిపాకం ఎస్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల సవరణలో పొరబాట్లు ఉండొద్దు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ–2024 కార్యక్రమంలో ఎక్కడా కూడా పొరబాట్లు ఉండటానికి వీల్లేదని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం దరఖాస్తులపై విచారణ, క్షేత్రస్థాయి పరిశీలన అంశాలపై పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్‌తో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ డెత్ డూప్లికేట్, జీరో డోర్ నెంబర్, పది కంటే ఎక్కువ ఓటర్లు ఒకే డోర్ నెంబర్‌లో ఉన్నవాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా నివేదిక ఇవ్వాలన్నారు. ఇటీవల ప్రకటించిన ముసాయిదా ఓటర్ల జాబితాకు సంబంధించి రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులుపై బీఎల్‌ఓలు క్షేత్రస్థాయిలో విచారించాలన్నారు. పారదర్శకమైన తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీపై ఎన్నికల కమిషనర్ రూపొందించిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. దరఖాస్తులను ధృవపత్రాలతో సహా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్యాలయ మేనేజరు ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు కొత్తగా ఆలోచించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రుషేంద్రబాబు

ఐరాల: ప్రతి ఉపాధ్యాయుడు కొత్తగా ఆలోచనలతో బోధనలు సాగిస్తే వినూత్న ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్‌నాయుడు అన్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో గురువారం 2024–25 సంవత్సరానికి సంబంధించి ఆవాస ప్రాంతాలు, అభివృద్ధి ప్రణాళికపై మండలంలోని ఉపాధ్యాయులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు మాట్లాడుతూ సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. ఆవాస ప్రాంతాల్లో 5 నుంచి 18 ఏళ్ల విద్యార్థుల వివరాలను నమోదు చేయాలన్నారు. విద్యార్థుల నోట్‌బుక్స్ విధిగా పరిశీలించాలని చెప్పారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అభివృద్ధి ప్రణాళికను పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు.

పాడి రైతులందరికీ ఆరోగ్య సంరక్షణ కార్డులు

గుడిపాల: పాడి రైతులందరికీ పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు అందజేయనున్నట్లు పశువైద్యాధికారి సాయిసుధ అన్నారు. వసంతాపురం, గుడిపాల పంచాయతీలలో గురువారం పాడి రైతులకు పశు ఆరోగ్య సంరక్షణ కార్డులను ఆమె అందజేశారు. ఆమె మాట్లాడుతూ 17,117 పశువులు గుడిపాలలో ఉన్నాయన్నారు. ఇందులో 4,560 పశువులకు సంబంధించి ఆరోగ్య సంరక్షణ కార్డులను అందజేయనున్నారు. మిగతా పశువులకు సంబంధించి విడతల వారీగా ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్డులో పశువులకు సంబంధించిన వివరాలన్నీ ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది అబ్దుల్లా, ఆసిమ్, శివ తదితరులు పాల్గొన్నారు.



పశు ఆరోగ్య కార్డులను అందజేస్తున్న డాక్టర్ సాయిసుధ

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించుకుందాం

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు
- కొనసాగుతున్న 'వై ఏపీ నీడ్స్ జగన్'
- సంక్షేమ బోర్డుల ఆవిష్కరణ



బంగారుపాళెం: కొదలమడుగులో జగనన్న బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు





చిత్తూరు: జెండా ఆవిష్కరిస్తున్న మేయర్ అముద, తవణంపల్లె: బోర్డు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

బంగారుపాళెం: రాష్ట్ర సమగ్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని కొదలమడుగు గ్రామ సచివాలయంలో గురువారం సాయంత్రం సర్పంచ్ మాలతి ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రజలకు బుక్‌లెట్లను పంపిణీ చేసి ప్రభుత్వం ద్వారా సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల్లోని మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటినీ అవినీతికి తావు లేకుండా పథకాలను అమలు చేశామన్నారు. టీడీపీ నేతల్లాగా మాయ మాటలు చెప్పే అలవాటు తమకు లేదని, మాట ఇచ్చామంటే ఖచ్చితంగా ఎంత కష్టమైనా అమలు చేస్తామని చెప్పారు. రాజకీయాలకు, కులమతాలకు అతీతంగా ప్రజా సంక్షేమాని కోరే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరొక్క సారి సీఎంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, ఎంపీటీసీ రవీంద్ర, కీరమంద సర్పంచ్ రాజా, మార్కెట్ కమిటీ చైర్మన్ నారే సోమశేఖర్, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్‌రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన

చిత్తూరు కార్పొరేషన్: జగనన్నతోనే సంక్షేమ పాలన అందుతుందని మేయర్ అముద తెలిపా రు. స్థానిక చవటపల్లెలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ బోర్డును ప్రారంభించారు. అనంతరం కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డివిజన్‌లో పర్యటించి తటస్తులతో సమావేశమై రాత్రి నిద్ర చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, నగర పార్టీ అధ్యక్షులు జ్ఞానజగదీష్, టిమ్ము, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు రాంగణేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే నవరత్నాలు

గుడిపాల: ఆర్థిక అసమానతలు తొలగించి, పేదరికం లేని సమాజ స్థాపన కోసమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ ప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం వసంతాపురం సచివాలయం ఆవరణలో సర్పంచ్ రజినీకాంత్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలనే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేసి, సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్, శ్రీధర్‌రెడ్డి, సాయి, రవీంద్రారెడ్డి, వెంకటేశులురెడ్డి, శింభు, జయకోడి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

మరోసారి గెలిపించుకుందాం

పూతలపట్టు: రాబోయే ఎన్నికల్లో మరోసారి జగనన్ననే సీఎంగా గెలిపించుకుందామని పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిటిపిరాళ్ల పంచాయతీ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించా రు. సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవి ష్కరించారు. ఈ కార్యక్రమంలో పెనుగొండ వైఎస్సార్‌సీపీ పరిశీలకులు తలపులపల్లె బాబురెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి, నాయకులు రాజారత్నంరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, ఎంపీటీసీ చైతన్య, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వల్లి, నాయకులు బాబురెడ్డి, కోదండరెడ్డి, నిరంజన్‌రెడ్డి, అమరనాథరెడ్డి, మణి, షణ్ముగం, నాగరాజు, మాసిలామణి, పట్టాభిరెడ్డి, రామూర్తి, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ

యాదమరి: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ జెండాను జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి ఆవిష్కరించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని గురువారం యాదమరి సచివాలయ పరిధిలో నిర్వహించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించినట్లు వివరించారు. అనంతరం ర్యాలీగా వచ్చి మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌బాబు, సర్పంచ్ ఝాన్సీ, వైస్ ఎంపీపీ రవీంద్రబాబు, హరనారాయణ రెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, పెరుమాళ్లపల్లె మనోహర్ రెడ్డి, వాసు రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్ జగనన్న

ఐరాల: అభివృద్ధికి కేరాఫ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లె సచివాలయంలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ రాజేంద్ర, ఎంపీడీఓ నాగరాజు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

తవణంపల్లె: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరో సారి సీఎంగా గెలిపించుకునేందుకు కలసికట్టుగా పని చేయాలని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సి. హరిరెడ్డి చెప్పారు. మండలంలోని టి.పుత్తూరు సచివాలయంలో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ బోర్డును, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. జగనన్న నువ్వే మా నమ్మకం కిట్లను వలంటీర్లకు, గృహసారథులకు పంపిణీ చేశారు. మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్, ఎంపీటీసీ ధనంజయరెడ్డి, సర్పంచ్ చలపతి, పంచాయతీ కార్యదర్శులు కవితారాణి, లక్ష్మీపతి, పార్టీ నాయకులు రమణారెడ్డి, పరమేశ్వర రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, జగన్నాధంరెడ్డి, శ్రీరాములు రెడ్డి, పాలాక్షిరెడ్డి, గుణశేఖర్ రెడ్డి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



గుడిపాల: వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ







పూతలపట్టు: జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు, యాదమరి: మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయి రెడ్డి, ఐరాల: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి